క్లుప్తంగా

విగ్రహ ఏర్పాటు అనుమతికి వినతి



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో ఇంజాపూర్ గ్రామస్తులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం ఇంజాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటుకు దేవాదయ శాఖ నుంచి అనుమతి ఇప్పించాలని గ్రామస్తులు కోరారు. ఆదివారం స్థానిక నాయకుడు బొక్క భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేరు ప్రఖ్యాతులు గాంచిన దేవాలయం అభివృద్ధికి సహకరించాలన్నారు. ఎమ్మెల్యే దీనికి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే పర్మిషన్ ఇప్పిస్తానని చెప్పినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ధన్‌రాజ్ గౌడ్, వంశీదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



భిక్షపతిని సన్మానిస్తున్న నాయకులు

మంచాల: పేద విద్యార్థుల విద్య అభివృద్ధికి కృషి చేసిన డాక్టర్ భిక్షపతిని ఆదివారం వివిధ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఆయన ఇటీవలే వసుంధర సాహితీ అకాడమి ఆధ్వర్యంలో విద్యారత్న అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వీఆర్‌వన్ ఫౌండేషన్ చైర్మన్ కుకుడాల వెంకటేశ్వరరెడ్డి, జనసందేశ్ ఫౌండేషన్ చైర్మన్ గోగిరెడ్డి లచ్చిరెడ్డి, వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. నాయకులు శేఖరప్ప, హరీశ్, ఈశ్వరప్ప, సతీష్, రాజప్ప, రాజేశ్వర్ చంద్రశేఖర్, పరమేష్, బీజేపీ నాయకులు వెంకట్ రెడ్డి, శ్రీశైలం, మండల అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం



టోర్నీ ప్రారంభించిన నిర్వాహకులు

కడ్తాల్: ఆరోగ్యకర సమాజానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, మానసిక వికాసం పెంపొందుతుందని వక్తలు అన్నారు. మండల పరిధి చరికొండలో ఆదివారం గాదమోని విజేందర్‌గౌడ్ స్మారకార్థం నిర్వాహకులు శేఖర్, రాము మండల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారుల ప్రతిభకు కొదవలేదని, వారిని ప్రోత్సహిస్తే.. జాతీయ స్థాయిలో రాణించేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌గౌడ్, భీష్మాచారి, వెంకటేశ్, లింగం, హరిచంద్ర, రాజేశ్, శ్రీశైలం, నరేశ్, సచిన్ పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఘనస్వాగతం



కార్యకర్తలకు అభివాదం చేస్తున్న కేటీఆర్

ఆమనగల్లు: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్.. అచ్చంపేట జనగర్జనకు వెళ్తున్న నేపథ్యంలో ఆదివారం పట్టణంలోని రాజీవ్ కూడలి వద్ద గులాబీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు అర్జున్‌రావ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, మార్కెట్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు కేటీఆర్‌కు శాలువా కప్పి సన్మానించారు.

మదర్సాలో ప్రత్యేక ప్రార్థనలు



నిర్వాహకులను సన్మానిస్తున్న ముస్లిం నాయకులు

ఆమనగల్లు: చింతలపల్లి జామియా నిజాం మియా మదీనాతుల్ మదర్సాలో ఆదివారం ఖాతమి ఖురాన్ నిర్వహించారు. మదర్సా చైర్మన్ ఖామరుద్దీన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, దువ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మదర్సా నిర్వాహకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు జహంగీర్, ముస్లిం నాయకులు జబ్బార్, జలాల్, నయీం, మజీద్‌ఖురేషి, బురాన్, జహంగీర్, ఖలీద్, ఇమ్రాన్, షానవాజ్ తదితరులు పాల్గొన్నారు.

చెదిరిన ఎన్ని'కల'!



పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎదురు చూసిన రిజర్వేషన్ల ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. కానీ పోటీ చేయాలనుకున్న వారు.. ఆశనిరాశల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. ఆశలు తారుమారు అయిన వారు.. నిరాశలో ఉండగా.. కలిసి వచ్చిన వారు పంచాయతీ పోరుకు సన్నద్ధం అవుతున్నారు. ఇక ఎన్నికలు జరగడమే ఆలస్యం..

అదృష్టం తారుమారు

- నిరాశపర్చిన రిజర్వేషన్లు.. ఆందోళనలో ఆశావహులు
- బరిలో దిగేందుకు అర్హుల తహతహ
- గెలుపుగుర్రాల వేటలో పార్టీలు
- పల్లెల్లో వేడెక్కిన రాయకీయం

ఆమనగల్లు: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేయాలనుకున్న పలువురు ఆశావహులకు రిజర్వేషన్లు కంగుతినిపించాయి. ఇన్నాళ్లు బరిలో దిగాలని భావించి.. ప్రజాక్షేత్రంలో కాలికి బలపం కట్టుకొని తిరిగిన వారికి నిరాశే మిగిలింది. కొన్నిచోట్ల పోటీకి అవకాశం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రిజర్వేషన్లు అనుకూలంగా ఉంటాయని భావించి, ఎన్నో కలలు కన్నవారికి.. రిజర్వేషన్లు తారుమారు కావడంతో.. వారి కలలు కల్లలుగానే మిగిలాయి. అదృష్టం కలిసి వచ్చినవారు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు తహతహలాడుతున్నారు. గెలుపు గుర్రాల కోసం రాజకీయ పార్టీల నాయకులు రంగంలోకి దిగారు. అవకాశం ఉంటే తాము.. లేదా తమ అనుచరులను దించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

దురదృష్టం

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహుల ఆశలు తారుమారయ్యాయి. గత పాలకవర్గం కాలం ముగిసి నాటి నుంచి.. నిన్నటి వరకు ప్రజల మధ్య ఉంటూ.. ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా నేనున్నానంటూ ముందు వరుసలో ఉన్నారు. శక్తికి మించి ఖర్చు చేస్తూ ప్రజలను ఆకర్షించేందుకు తహతహలాడారు. పోటీ చేయాలనుకున్న నాయకులు.. తమ పార్టీ అధినేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ.. వారి ప్రాపకం కోసం తీవ్ర యత్నం చేశారు. కానీ రిజర్వేషన్ల కేటాయింపుతో పరిస్థితి అంతా తల్లకిందులుగా మారింది. పోటీ చేసే అవకాశం లేకపోవడంతో నిరాశలో ఉన్నారు.

అదృష్టం

రిజర్వేషన్ల కేటాయింపు కొందరికి కలిసి వచ్చింది. ఆమనగల్లు మండలం మంగళపల్లి ఎంపీటీసీ స్థానం ఎస్టీ మహిళకు కేటాయించారు. అయితే ఆ గ్రామంలో ఆ సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు రెండే ఉండటం వారిని అదృష్టం తలుపుతట్టింది. కడ్తాల్ మండలంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేయాలనుకున్న నాయకులకు రిజర్వేషన్లతో ఏం చేయాలో పాలుపోవడం లేదు. ఆ స్థానాలు మహిళలకే కేటాయించడంతో.. తమ సతులను రంగంలోకి దింపేందుకు యత్నిస్తుండగా.. మరికొందరు రాజకీయాలు వద్దంటూ దూరమవుతున్నారు.

ఎక్కడ.. ఎవరు

ఆమనగల్లు జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు జనరల్‌కు కేటాయించారు. కడ్తాల్‌లో జెడ్పీటీసీ బీసీ మహిళ, ఎంపీపీ జనరల్ మహిళకు రిజర్వ్ అయింది. తలకొండపల్లి జెడ్పీటీసీ బీసీ మహిళ, ఎంపీపీ ఎస్టీకి ఇచ్చారు. మాడ్గుల జెడ్పీటీసీ బీసీ, ఎంపీపీ జనరల్‌కు కేటాయింపు. అలాగే ఆమనగల్లు మండలంలో ఆకుతోటపల్లి ఎంపీటీసీ(బీసీ). మంగళపల్లి ఎంపీటీసీ (ఎస్టీ-మ). మేడిగడ్డతండా ఎంపీటీసీ (జనరల్). రాంనుంతల ఎంపీటీసీ (బీసీ-మ). పోలెపల్లి ఎంపీటీసీ (ఎస్టీ-మ) కేటాయించారు. మాడ్గులలో అప్పారెడ్డిపల్లి ఎంపీటీసీ (ఎస్టీ). ఆర్కపల్లి ఎంపీటీసీ (ఎస్టీ-మ). నాగిళ్ల ఎంపీటీసీ (ఎస్సీ). బ్రాహ్మణపల్లి ఎంపీటీసీ (ఎస్సీ-మ). ఇర్విన్ ఎంపీటీసీ (ఎస్సీ-మ). సుద్దపల్లి ఎంపీటీసీ (బీసీ-మ). అవురుపల్లి ఎంపీటీసీ (బీసీ-మ). కొల్కులపల్లి ఎంపీటీసీ (బీసీ-మ). మాడ్గుల 1 ఎంపీటీసీ (బీసీ). మాడ్గుల ఎంపీటీసీ 2(జనరల్). కలకొండ (బీసీ-మ). కుబ్యాతండా ఎంపీటీసీ (బీసీ). గిరికొత్తపల్లి ఎంపీటీసీ(జనరల్). కాట్రగానితండా ఎంపీటీసీ(జనరల్). కడ్తాల మండలంలో చరికొండ ఎంపీటీసీ (ఎస్టీ). చల్లంపల్లి ఎంపీటీసీ (ఎస్టీ). సాలార్‌పూర్ ఎంపీటీసీ (ఎస్సీ). కడ్తాల్ 1 ఎంపీటీసీ (ఎస్సీ-మ). కడ్తాల 2 ఎంపీటీసీ (ఎస్టీ-మ). ఎక్వాయిపల్లి(బీసీ). ముద్విన్ ఎంపీటీసీ (బీసీ). రావిచేడ్ ఎంపీటీసీ (బీసీ-మ). కర్కల్‌పహాడ్ ఎంపీటీసీ (బీసీ-మ). మైసిగండి ఎంపీటీసీ జనరల్‌కు కేటాయించారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



తుర్కయంజాల్: భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

తుర్కయంజాల్: భగత్‌సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.శివకుమార్ గౌడ్ అన్నారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర పోరాటంలో భగత్‌సింగ్ పాత్ర కీలకమైందని, 23 ఏళ్ల వయసులోనే దేశం కోసం ప్రాణాలను విడిచారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఐ మున్సిపాలిటీ కార్యదర్శి అనంతుల రాజు గౌడ్, బీఎస్పీ నాయకులు మేతరి కుమార్, నాయకులు గండికోట శివ, సాయి భగత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: నాయిబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి భగత్‌సింగ్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అంజయ్య, కోశాధికారి మహేందర్, నాయకులు మహేశ్, కుమార్ తదితరులు ఉన్నారు.

మాల్‌లో..

యాచారం: భగత్‌సింగ్ జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధి మాల్ గ్రామం సాగర్ హైవేపై ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ ఆశయాల కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జంగయ్య, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి విప్లవ్‌కుమార్, నాయకులు చందునాయక్, సత్యనారాయణ, రాములు, జంగారెడ్డి, ప్రభాకార్ తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్‌లో..



యాచారం: మాల్‌లో..

'పూర్'పాలన!

- మున్సిపాలిటీకి సిబ్బంది కొరత
- వచ్చినవారు వచ్చినట్లే మాతృసంస్థకు..
- మరో ఇద్దరు గ్రూప్- 2కు ఎంపిక
- అస్తవ్యస్తంగా పరిపాలన
- ఉన్నవారిపై పని'భారం'



మున్సిపాలిటీ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: శరవేగంగా విస్తరిస్తున్న పట్నం పురపాలక సంఘానికి సిబ్బంది లేమి ఇబ్బందిగా మారింది. ఫలితంగా పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. డిప్యూటేషన్, ఇన్‌చార్జిలతోనే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. కమిషనర్‌తో పాటు వీఆర్‌ఏ, వీఆర్‌ఏలను రెవెన్యూ శాఖ నుంచి మున్సిపల్ కార్యాలయానికి అటాచ్ చేసిన 13 మంది, గ్రూప్- 4 నుంచి మరో 8 మంది మినహా మిగతా వారంతా తాత్కాలిక సిబ్బందే కావడం గమనార్హం.

13 మంది మాతృసంస్థలోకి..

రెవెన్యూశాఖలోని వీఆర్‌ఓ, వీఆర్‌ఏ వ్యవస్థలను గత ప్రభుత్వం ఎత్తివేసిన అనంతరం.. 2022 ఆగస్టులో వీఆర్‌ఓలను, 2023 ఆగస్టులో వీఆర్‌ఏలను వివిధ శాఖల్లో పోస్టింగ్ ఇచ్చి ప్రభుత్వం భర్తీ చేసింది. ఇందులో భాగంగా పట్నంకు 13 మందిని కేటాయించారు. గ్రూప్- 4లో మరో 8 మంది ఉద్యోగులు చేరారు. వీరిలో చాలమందిని వార్డు ఆఫీసర్లుగా నియమించి, ఆయా కాలనీలు, బస్తీల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పారిపాలనాధికారుల వ్యవస్థను ఏర్పాటు చేయగా.. ఇక్కడికి వచ్చిన 13 మంది మాతృసంస్థకు వెళ్లిపోయారు. గ్రూప్- 4 ద్వారా చేరిన దేవరాం, జగదీశ్వర్లు తాజాగా ఆదివారం వెలువడిన గ్రూప్- 2 ఫలితాల్లో ఎంపికయ్యారు. దీంతో మరో రెండు పోస్టులు ఖాళీ అయ్యాయి. మరో ఉద్యోగి మెటర్నిటీ సెలవులో ఉన్నారు.

నాలుగు వార్డులకు ఒక్కరు

మున్సిపాలిటీలో 24 వార్డులున్నాయి. తాజా పరిస్థితులను పరిశీలిస్తే మూడు, నాలుగు వార్డులకు ఒక్క వార్డు ఆఫీసరే పనిచేయాల్సి ఉంటుంది. ఒక పక్క పన్ను వసూలు, మరో పక్క ఇందిరమ్మ ఇళ్ల లాగిన్, పనుల పర్యవేక్షణతో పాటు డ్రైనేజీ, తాగునీరు, వీధిలైట్ల నిర్వహణ, మరణ, జనన ధృవీకరణ పత్రాల విచారణ తదితర పనులు చేయాల్సి ఉంటుంది. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉంటుంది. ఒక్కరు నాలుగు వార్డులపై దృష్టిపెట్టాల్సి రావడంతో పనిభారం, ఒత్తిడి పెరగనుంది.

అదనపు బాధ్యతలు..

మున్సిపల్ ఏఈ గుణాకర్ తక్కుగూడ మున్సిపాలిటీ ఇన్‌చార్జి ఏఈగా కాకుండా.. శంకర్‌పల్లి, ఆమనగల్లు, కొత్తూరు మండలాలకు మిషన్ భగీరథ పబ్లిక్ హెల్త్ ఏఈగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారి దినేశ్.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి టీపీఓగా కొనసాగుతున్నారు. మేనేజర్, అకౌంటెంట్, మూడు బిల్ కలెక్టర్ పోస్టులు ఖాళీగా ఉండగా.. నల్లగొండ మున్సిపల్ కార్యాలయ రెగ్యులర్ సీనియర్ అసిస్టెంట్ శివలింగం, పట్నం పురపాలికలో డిప్యూటేషన్ అధికారిగా కొనసాగుతున్నారు. ఆర్‌ఓ, ఆర్ఐ పోస్టులు మంజూరు కాక.. భవన నిర్మాణాలు, ఆస్తి పన్ను వసూలు వ్యవహార బాధ్యతలు ఆ అధికారే చూస్తున్నారు.

పరిష్కారానికి కృషి



మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉంది. వచ్చిన వారు వచ్చినట్టే మాతృసంస్థకు వెళ్లిపోయారు. మరో ఇద్దరు గ్రూప్- 2కు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఉన్నవారిపై అదనపు భారం పడింది. పరిస్థితిని ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

– సత్యనారాయణ, కమిషనర్, ఇబ్రహీంపట్నం

గ్రూప్-1 ర్యాంకర్‌కు సన్మానం

ఆమనగల్లు: గ్రూప్ 1 ర్యాంకు సాధించి, మున్సిపల్ కమిషనర్‌గా ఎంపికైన కావటి మల్లేశ్‌ను.. ఆదివారం మాజీ కౌన్సిలర్ బైకని యాదమ్మ ఘనంగా సన్మానించారు. పట్టణంలోని గుర్రంగుట్టకాలనీకి చెందిన మల్లేశ్.. రాష్ట్ర స్థాయిలో 187వ ర్యాంకు, మల్టీజోన్ 2లో 92వ ర్యాంక్ సాధించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలంయాదవ్, యాదయ్య తదితరులు ఉన్నారు.



మల్లేశ్‌ను సత్కరిస్తున్న యాదమ్మ, శ్రీశైలంయాదవ్



జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా గుర్రం జాషువా జయంతి

మంచాల: గుర్రం జాషువా జయంతి ఆరుట్లలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. దళిత జాతి ఉద్ధరణ కోసం జాషువా రాసిన కవితలు ఎంతో స్ఫూర్తి దాయకమన్నారు. ఆయన కవితలు, నవలలు, రచనల ద్వారా ప్రజలను చైతన్యపరిచారని గుర్తుచేశారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, భాస్కర్, మురళి, కృష్ణగౌడ్, చంద్రయ్య, పరమేష్, జానిపాష, పున్నం రాము తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఘాట్ ధ్వంసం



ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

మాడ్గుల: బతుకమ్మ ఘాట్ తమదేనంటూ ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అవురుపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఆదివారం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన గౌని నరసింహ్మ గౌడ్.. విలేకరిని అంటూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. బతుకమ్మ ఘాట్‌లోని మర్రిచెట్టును తొలగించి, దిమ్మెను ధ్వంసం చేశాడని తెలిపారు. ప్రస్తుతం ఆ స్థల వివాదం కోర్టు పరిధిలో ఉందని, అయినా గొడవ చేస్తున్నాడని పేర్కొన్నారు. అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని, ఘాట్‌ను పరిరక్షించాలని కోరుతున్నారు.

దేశ నిర్మాణమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం



విజయదశమి వేడుకలో ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యులు

ఆమనగల్లు: వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ ధర్మజాగరణ ప్రముఖ్ లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో ఆదివారం సంఘ్ వందేళ్ల స్థాపన ఉత్సవాల్లో భాగంగా విజయదశమి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1925లో ప్రారంభమైన ఆర్‌ఎస్‌ఎస్.. దేశవ్యాప్తంగా విస్తృతశాఖలతో విభిన్న రంగాలలో దేశభక్తిపూరిత హిందుత్వ ఆధార సంస్థలతో పనిచేస్తుందని తెలిపారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇంటింటి జనజాగరణ చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు ఆచారి, సభ్యులు బిచ్యానాయక్, అంజయ్య, ఆనంద్, విశ్వనాథం, తిరుపతయ్య, మనోహర్, భాస్కరచారి, మధు, నర్సింహ, గణేశ్ తదితరులు పాల్గొన్నారు. విఠాయిపల్లిలో ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో రామస్వామి, అంజయ్య, నర్సింహ, నిరంజన్, శ్రీను, కొండయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న రాంరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పారిశుద్ధ్య కార్మికులకు బీఆర్‌ఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుందని సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధి ఉప్పరిగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలో 850 మంది కార్మికుల కుటుంబాలకు దుస్తులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెండేళ్లుగా సర్పంచులు లేక.. కార్మికులను పట్టించుకునే వారే కరువయ్యారని తెలిపారు. వారికి కనీస వేతనం రూ.18,500 చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్ వీక్షణ

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి సుల్తాన్‌పూర్‌లో ఆదివారం గ్రామస్తులతో కలిసి రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ప్రధాని మోదీ జాతి నుద్దేశించి ప్రసంగించారు. విప్లవకారుడు భగత్‌సింగ్, దిగ్గజ గాయని లతా మంగేష్కర్ జయంతీల సందర్భంగా వారిని స్మరించుకున్నారు. అక్టోబర్ 2 నుంచి దేశ ప్రజలందరూ ఖాదీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా నవరాత్రోత్సవాలు



కడ్తాల్: మైసిగండిలో.. మహాచండి అలంకరణలో అన్నపూర్ణేశ్వరిదేవి



ఇబ్రహీంపట్నం: మహాచండిగా రాజరాజేశ్వరి

దేవీ నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఏడో రోజు ఆదివారం అమ్మవారు మహాచండిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా దేవతామూర్తికి నిర్వాహకులు వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ విశేషపూజలు, హోమం, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

–సాక్షి, నెట్‌వర్క్



ఆమనగల్లులో..



యాచారం: మహాచండిగా.. జ్ఞాన సరస్వతి



కడ్తాల్: మైసిగండిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఇబ్రహీంపట్నం: ఈశ్వరాంజనేయస్వామి ఆలయంలో.. మహిళల కుంకుమార్చన



ఆమనగల్లు: అమ్మవారి సన్నిధిలో విష్ణుపారాయణం చేస్తున్న మహిళలు



తుర్కయంజాల్‌లో..